
వై.పాలెంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే తాటిపర్తి


వై.పాలెం: ఎస్సీ బాలికల హాస్టల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి


కురిచేడు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అణగారిన వర్గాల వేగుచుక్క డాక్టర్ అంబేడ్కర్

బాబాసాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సభలను దర్శి, యర్రగొండపాలెం నియోజకవర్గాల్లో వాడవాడలా నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు తమ కార్యాలయాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. విద్యార్థులు, యువకులు ఉత్సాహంగా పాల్గొని బాబా సాహెబ్‌కు ఘన నివాళులర్పించారు.

- దర్శి, వై.పాలెం నియోజకవర్గాల్లో బాబా సాహెబ్‌కు ఘన నివాళి
- వాడవాడలా అంబేడ్కర్ జయంతి ఉత్సవాలు
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

పుల్లలచెరువు: సమాజంలో అసమానతలు తొలగిపోవాలని, సమసమాజ స్థాపనకు అహర్నిశలూ కృషి చేసిన అణగారిన వర్గాల వేగుచుక్క డాక్టర్ బీఆర్ అంబేడ్కర్..అని మండల ఉపాధ్యక్షుడు ఎల్.రాములు అన్నారు. సోమవారం స్థానిక బస్‌స్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన 134వ జయంతి సభ ఘనంగా నిర్వహించారు. తొలుతగా అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ అంబేడ్కర్ దళితునిగా జన్మించి కుల వివక్షకు గురయ్యారని, మొక్కవోని దీక్షతో, సంకల్పంతో ఉన్నత విద్యను అభ్యసించి గొప్ప విజ్ఞానాన్ని పొంది రాజ్యాంగాన్ని రూపొందించారని కొనియాడారు. భారత రాజ్యాంగాన్ని రచించి పౌరులకు హక్కులను కల్పించి న్యాయ కోవిదుడిగా, ఆర్థిక వేత్తగా, ప్రపంచ మేధావిగా కీర్తింపబడుతున్నారని అంబేడ్కర్ సేవలను కొనియాడారు. బడుగు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించి మహనీయుడయ్యారని వక్తలు పేర్కొన్నారు. సర్పంచ్ ఓబులేసు, నాయకులు రఘు, యూ.హనుమంతరావు, ఎలిశల కోటేశ్వరరావు, బంకా శ్రీనివాసరావు, శ్రీను, కమిటీ సభ్యులు గుంటి శ్రీను, నాగేశ్వరరావు, చెన్నకేశవులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించుకున్నారు.

పెద్దారవీడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఆయన చిత్రపటానికి ఈఓఆర్డీ కేజీఎస్ రాజు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారత రాజ్యాంగం ఉన్నంత కాలం భారత ప్రజలు మరిచిపోరని, భవిష్యత్ తరాలకు ఏం అవసరమో ముందే ఆలోచించి రాజ్యాంగాన్ని రచించారని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఈ.గోవిందరెడ్డి, కె.భానునాయక్, కంప్యూటర్ ఆపరేటర్ ప్రసాద్, ఆశా కార్యకర్తలు మేరీ, రాణి, క్లాప్ మిత్రలు పాల్గొన్నారు.

కురిచేడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీటీసీ కార్యాలయం ఆవరణలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కులమత భేదాలను తొలగించి అందరికీ హక్కులు కల్పించేందుకు అంబేడ్కర్ పోరాడిన తీరును జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి గుర్తుచేశారు. ఆయన చూపిన మార్గంలో నడవటమే నిజమైన నివాళి అన్నారు. పడమర హరిజనవాడలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ వైవీ సుబ్బయ్య, జిల్లా అధికార ప్రతినిధి గోగుల మూడి లింగారెడ్డి, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు నిమ్మకాయల రాజయ్య, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, ఏఎంసీ మాజీ ఉపాధ్యక్షుడు కండె గంగయ్య, సొసైటీ మాజీ చైర్మన్లు పోతిరెడ్డి నాగిరెడ్డి, ఊట్ల వెంకటేశ్వర్లు, మాజీ ఉప సర్పంచ్ గుంటక నాసరరెడ్డి, నాయకులు సారెడ్డి నాగిరెడ్డి, ఎన్వీ నాగిరెడ్డి, కోలా సంతోష్‌కుమార్, అంకె గోపాలకృష్ణ, వెంకటేశ్వర్లు, దాసరి రమేష్, కంభంపాటి జోసఫ్, నక్క బుజ్జి, అంజి, అంకె శ్రీను, వై.మోషే, దేవదాసు, బి.ఆదినారాయణ, నుసుం వెంకటరెడ్డి, పాస్టర్ కట్టా కిరణ్, వడ్డె రమేష్, బి. బెన్‌హర్‌బాబు, బి.ఏలియా, ఎం.కుమార్, బి.ఏసుపాదం, ఎం. జక్రయ్య, రమణయ్య, శ్రీను, ఎం.సురేష్, పి.జాన్, బి.వెంకటేష్, జే. కృపాసాగర్, బాబూజీ పాల్గొన్నారు.

దొనకొండ: మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ సీపీ మండల కన్వీనర్ కాకర్ల కృష్ణారెడ్డి, గుంటు పోలయ్య, కాలూరి అజయ్ రమణ, కాటే వసంత, తమ్మనేని సుబ్బారెడ్డి, కొంగలేటి మోషే, బాబులు స్థానిక అడ్డరోడ్డులోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రైల్వే గుంటూరు డివిజన్ పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి నర్సయ్య, దొనకొండ పింఛనర్స్ అసోసియేషన్ కార్యదర్శి బి.జయరావు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక ఎస్సీ వసతి గృహంలో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ, మండల ప్రత్యేకాధికారి బాలమ్మ అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బేతేలుపురంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి, కార్యకర్త జయమణి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక గౌతమి డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ రామయోగి, అడ్మిన్ నాని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఓబ్బాపురం యూత్ ఆధ్వర్యంలో కుందుర్తి లక్ష్మణ్, సుబ్బయ్య అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో యువకులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముండ్లమూరు (కురిచేడు): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలను మండలంలో ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ కులవివక్ష, మతోన్మాదం, స్త్రీల పట్ల అణచివేతను వ్యతిరేకించారని జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు పేర్కొన్నారు. స్థానికంగా సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు వేంపాడులో కేవీపీఎస్ ఆధ్వర్యంలో, మారెళ్లలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. కోటేశ్వరరావు, ఆంజనేయులు, శ్రీను, బి.హనుమంతరావు, సత్యం, తిరుపతమ్మ, చిన్న ఏడుకొండలు, సంజీవరావు పాల్గొన్నారు.


దర్శి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

పెద్దదోర్నాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ ఆచరించాలని వైఎస్సార్ సీపీ నాయకులు లాలూనాయక్ పేర్కొన్నారు. బీఆర్ అంబేడ్కర్ 134వ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని నటరాజ్ సెంటర్లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు అంబేడ్కర్ ఆరాధ్య దైవమన్నారు. అనాడు రాజ్యాంగ పరంగా ఇచ్చిన ఫలాలు ఈనాడు పంచుకుంటున్నామని చెప్పారు. అంబేడ్కర్ ప్రపంచానికే ఆదర్శప్రాయుడన్నారు. యువత పెడదోవ పట్టకుండా ముందుకు సాగాలని సూచించారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో, శాఖా గ్రంథాలయంలో, అగ్నిమాపక కేంద్రంలో అంబేడ్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దళిత సంఘాల నాయకులతో పాటు పలువురు పాల్గొని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దర్శి (కురిచేడు): భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు మండలంలో అంబరాన్నంటాయి. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంటరెడ్డి ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శ్రీ గౌతమి హైస్కూల్, సంస్కృతి విద్యాలయం ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఎన్ఎస్పీ కాలనీలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాల మరియు కళాశాల ఆవరణలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులు నారాయణ, హెల్త్‌సూపర్‌వైజరు వై. రమణలు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యూటీఎఫ్ దర్శి డివిజన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని తూర్పు వీరాయపాలెంలో అంబేడ్కర్ యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వాకా జనార్దనరెడ్డి, దర్శి మండల శాఖ ప్రధాన కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, దోర్నాల మండల శాఖ ప్రధాన కార్యదర్శి నేరెళ్ల జాన్, మండల శాఖ బాధ్యులు వి.చక్రధర్, జి.వేణు, ఎంవీ నరసింహం, సందు వెంకటేశ్వర్లు, అల్లు రమణారెడ్డిలు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి బి.బ్లెస్సీ ఆదేశాల మేరకు ఎస్సీ, ఎస్టీ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ మహిళా అధ్యక్షురాలు సీహెచ్ దయామని, దర్శి తాలూకా అధ్యక్షుడు మెండెం వసంతకుమార్ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జి.దేవప్రసాద్, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, కౌన్సిలర్లు మేడం మోహనరెడ్డి, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, నాయకులు శ్రీనివాసరావు, అన్నవరపు రవి, కుంటా అచ్చారావు, కొడవటి జాన్, సామేలు, మజ్నువలి, చెరుకూరి జగన్, లక్ష్మీరెడ్డి, డగ్లస్, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మీనిగ శ్రీను, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ జి. విజయకుమార్, మండల అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి పి.ఖాశిం, కోశాదిధికారి కె.రామారావు, సహాధ్యక్షుడు అట్లూరి రామారావు, సీనియర్ బాధ్యులు ఎం.నాగేశ్వరరావు, జిల్లా కౌన్సిల్ సభ్యులు సీహెచ్ తిరుపతిరెడ్డి, ఎస్.ఏడుకొండలు, బి.అంకయ్య, బి. రామాంజనేయులు, శ్యామల, సుభాషిణి, పిచ్చమ్మ పాల్గొన్నారు.


దర్శి: యూటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు

అంబేడ్కర్ రాజ్యాంగం ప్రపంచ దేశాలకు స్ఫూర్తి: తాటిపర్తి

యర్రగొండపాలెం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రూపొందించిన రాజ్యాంగం ప్రపంచ దేశాలకు స్ఫూర్తిగా నిలిచిందని ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం అంబేడ్కర్ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం దేశ ప్రజలు పరితపించి పోతున్నారని, ఆయన ఈ దేశానికి ఎంతో మేలు చేశారని, ఆయన లేని భారత దేశాన్ని ఊహించుకోలేక పోతున్నామన్నారు. ఈ రోజు దేశం నడుస్తుందన్నా, ప్రజాస్వామిక విధానంలో ముందుకు కొనసాగుతుందన్నా ఆయన గొప్పతనమేనని చెప్పారు. దేశాన్ని సమసమాజ నిర్మాణం కోసం, సమానత్వం కోసం, భిన్నత్వంలో ఏకత్వం కోసం ఆయన తీసుకున్న శ్రమ, కృషి, పట్టుదల ఫలితంగానే భారత దేశం అంచెలంచెలుగా ఎదుగుతోందని పేర్కొన్నారు. అంబేడ్కర్ అంటే ఒక వ్యక్తి కాదని, దేశం గరివ్వంచదగిన మేధత్వం కలిగిన మహావ్యక్తని కొనియాడారు. దేశంలోనే కొంతమంది అంబేడ్కర్‌పై విషం చిమ్ముతున్నారని, వారు కూడా తమ విధానాలు మార్చుకోవాలన్నారు. అంబేడ్కర్ నీళ్లు తాగుతుంటే ఆయన్ను కొట్టి లాగేసిన వ్యక్తులపై కూడా ఆయన ద్వేషం పెంచుకోలేదని, ప్రతి ఒక్కరూ తమకున్న హక్కు ఏ విధంగా వినియోగించుకోవాలి, తాను పడినటువంటి శ్రమ ఇంకొక్కరు పడకుండా ఏలా ఉండాలని బాధ్యతగా ప్రవర్తించారని, ఎవరిపై విషం చిమ్మలేదన్నారు. తొలుత స్థానిక ఎస్సీ బాలికల హాస్టల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థినులకు సందేశం ఇచ్చారు. తమ కుటుంబాలు బాగుపడాలన్నా, దేశం అభివృద్ధి దిశలో నడవాలన్నా చదువు ఒక్కటే మార్గమని గుర్తెరిగిన వ్యక్తి అంబేడ్కర్ అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిష్టించాలని, అంబేడ్కర్ మార్గంలో నడుస్తూ పదిమందికి జ్ఞానాన్ని పంచాలని చిన్నారులకు సూచించారు. ఆయా కార్యాక్రమాల్లో మండల ప్రత్యేకాధికారి విష్ణువర్ధన్, హాస్టల్ వార్డెన్ యాసిన్ బేగం, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, వైస్ ఎంపీపీ ఎం.ఆదిశేషు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు ఏకుల ముసలారెడ్డి, జిల్లా కార్యదర్శులు కె.ఓబులరెడ్డి, ఎస్.ప్రసాద్, త్రిపురాంతకేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఇమ్మడిశెట్టి వెంకట సుబ్బారాబు, ఆర్యవైశ్య సంఘ మండల అధ్యక్షుడు పబ్బిశెట్టి శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ డైరెక్టర్లు దొగిపర్తి సంతోష్ కుమార్, కె.సత్యనారాయణ చౌదరి, మదర్ థెరిస్సా విద్యాసంస్థల అధినేత వెంకటేశ్వర్లు నాయక్, పాస్టర్ల సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు, వివిధ విభాగాల నాయకులు సయ్యద్ జబీవుల్లా, ఆర్.అరుణాబాయి, సరళకుమారి, వై.వెంకటేశ్వరరెడ్డి, ఎస్.వెంకటరెడ్డి, ఎస్వైకే మూర్తి, వెన్నా మోహన్‌రెడ్డి, టి.రాంబాబు, కొండలు, షేక్ వలి, కె.నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.


పుల్లలచెరువు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సోమవారం ఘనంగా జరిపారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు వివిధ పార్టీలకు చెందిన నాయకులు, దళిత సంఘాల నాయకులు స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక గ్రంథాలయంలో గ్రంథపాలకురాలు కె.రూన్సీ ఆధ్వర్యంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. స్థానిక అంబేడ్కర్ నగర్‌కు చెందిన యువకులు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు.

త్రిపురాంతకం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని సోమవారం ఘనంగా జరుపుకున్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఆళ్ల సుబ్బమ్మ ఆంజనేయరెడ్డి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక బస్టాండ్‌కు సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వివిధ సంఘాలకు చెందిన నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.


పెద్దారవీడు: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఈఓఆర్డీ రాజు


ముండ్లమూరులో..


పెద్దదోర్నాల: అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నాయకులు


త్రిపురాంతకం: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు


దొనకొండ: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాకర్ల

పలువురికి ఎమ్మెల్యే బూచేపల్లి పరామర్శ

దర్శి (కురిచేడు): మండలంలోని లంకోజనపల్లి, లింగన్నపాలెం గ్రామాల్లోని పార్టీ నాయకుల కుటుంబ సభ్యులను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసనసభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి సోమవారం పరామర్శించారు. మృతదేహాలకు నివాళులర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. లంకోజనపల్లి సర్పంచ్ కోటయ్య భార్య మృతదేహానికి నివాళులర్పించి ఆయనకు ధైర్యం చెప్పారు. లింగన్నపాలెం ఎంపీటీసీ బండి గోపాలరెడ్డి తండ్రి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బండిగోపాలరెడ్డిని ఓదార్చారు. ఆయా కార్యక్రమాల్లో మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి

పేద కుటుంబానికి మానవత ఆపన్న హస్తం

దర్శి (కురిచేడు): స్థానిక శివాలయం పక్కన ఉన్న పెసరపాటి ఆదిలక్ష్మి కుటుంబానికి మానవత సంస్థ ఆపన్నహస్తం అందించింది. పెసరపాటి ఆదిలక్ష్మి ఇటీవల అకాల మరణం చెందింది. దీంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో కుటుంబ సభ్యులు ఉన్నారు. విషయం తెలుసుకున్న ఆదిలక్ష్మి కుటుంబ సభ్యులకు మావనవత స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు సంస్థ తరపున రూ.5 వేలు, ఇతర దాతల సహాయంతో రూ.18,500, మరో దాత సానికొమ్ము తిరుపతిరెడ్డి రెండు నెలలకు సరిపడా 50 కిలోల బియ్యాన్ని సోమవారం అందజేశారు. అందుకు గురవాచారి, అతని కుటుంబ సభ్యులు మానవతన సంస్థ ప్రతినిదులకు కృతజ్ఞతలు తెలిపారు. మానవత సంస్థ ప్రతినిధులు దేవతి వరప్రసాద్, ధనిరెడ్డి వెంకటరెడ్డి, కపురం శ్రీనివాసరెడ్డి, గొర్రెపాటి వేణు, చింతా తిరుపతిరెడ్డి, పాదిలి పెద్దిరాజు, ఖాదర్ మస్తాన్, సుశీలమ్మ, వెంకట్రావు, స్టూడియో మల్లి పాల్గొన్నారు.


పేద కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

2029లో అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీనే

- ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

తాళ్లూరు: జగన్ వెంటే జనం ఉన్నారని, 2029 వైఎస్సార్ సీపీ అధికారంలోకి వస్తుందని, ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని తురకపాలెంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి గంగమ్మ తల్లి జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభపై కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ పథకాలు అమలు చేయడంలో విఫలమైందని బూచేపల్లి అన్నారు. జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అందిస్తాం..అని చెప్పి వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి

నాగులమీరాస్వామికి పూజలు

పెద్దారవీడు: మండల కేంద్రం పెద్దారవీడులో నాగులమీరాస్వామి ఉరుసును మూడు రోజుల పాటు ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మకాణంలో కొలువుదీరిన పీరుకు ముజావరులు ప్రత్యేక ప్రార్థనలు చేసి పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. శనివారం అర్ధరాత్రి పూనకం వచ్చిన ముజావరులు పీరును ఎత్తుకుని ఆలయం ప్రాంగణంలో కొద్దిసేపు తిప్పుతూ కలకండను భక్తులకు పంచి పెట్టారు. ఆ సమయంలో కలకండ కోసం భక్తులు పోటీ పడతారు. పీరు వెంట మొక్కుబడులు ఉన్న భక్తులు జెండాలను ఎత్తుకుని తప్పెట్లు, మేళాలతో పూరవీధుల్లో ఊరేగింపుగా ఊరి చివర ఉన్న దర్గా వద్దకు చేరుకుంటారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని వెండి గొడుగులు, నగదు సమర్పించారు. పీరు ఇంటి ముందుకు రాగానే మహిళలు నీటి బిందెతో వారు పోసి బొరుగులను నైవేద్యంగా చెల్లిస్తారు. సోమవారం కనుమ పండగ నిర్వహించారు. సాయంత్రం పీరు ఊరేగింపుతో పాటు భక్తులు నైవేద్యం తీసుకొని దర్గాలో శ్రీ నాగులమీరాస్వామికి సమర్పిస్తారు. సాయంతం గ్రామస్తులతో కోలాటం ప్రదర్శించారు.


నాగులమీరాస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో గంగాభవాని తిరునాళ్ల

కురిచేడు: మండలంలోని గంగదొనకొండలో వేంచేసి ఉన్న శ్రీ గంగాభవాని అమ్మవారి తిరునాళ్ల సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు ఉదయం నుంచి పొంగళ్లు తయారు చేసి అమ్మవారికి నివేదించి మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల సౌకర్యార్థం దాతల సహకారంతో తాగునీరు, అన్నదానం ఏర్పాటు చేసినట్లు ఆలయ పాలక మండలి అధ్యక్షుడు వేమా వెంకట నారాయణ తెలిపారు. సోమవారం రాత్రికి మూడు విద్యుత్ ప్రభలు ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.


గంగాభవానికి మొక్కులు చెల్లిస్తున్న భక్తులు

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం


వై.పాలెం: కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎంఈవో ఆంజనేయులు, సిబ్బంది


అగ్నిమాపక సిబ్బందికి నివాళులర్పిస్తున్న అధికారులు

దర్శి (కురిచేడు): అగ్నిమాపక వారోత్సవాలు సోమవారం నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని అగ్నిమాపక కేంద్రం అధికారి తెలిపారు. ఎక్విప్‌మెంట్ స్టాల్‌ను మున్సిపల్ కమిషనర్ మహేష్ సోమవారం ప్రారంభించారు. అనంతరం అగ్ని ప్రమాదంలో అశువులు బాసిన సిబ్బందికి నివాళులర్పించారు. కరపత్రాలు, పోస్టర్లు ఆవిష్కరించారు. అగ్ని ప్రమాదాల నుంచి ఎలా రక్షించుకోవాలో వివరించినట్లు తెలిపారు. బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: అగ్నిమాపక వారోత్సవాలను స్థానిక అగ్నిమాపక కేంద్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఫైర్ ఆఫీసర్ హరిబాబు మాట్లాడుతూ 1944 ఏప్రిల్లో ముంబై ఓడరేవులో ఆయుధాలు, గన్ పౌడర్ కలిగిన పోర్ట్ స్టీరింగ్ నౌకలో అగ్ని ప్రమాదం సంభవించిందన్నారు. దీంతో హార్బర్‌లో ఉన్న అనేక నౌకలతో పాటు ఇతర బిల్డింగ్‌లకు మంటలు వ్యాపించి పెను ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదంలో 336 మంది సామాన్యులతో పాటు 66 మంది అగ్నిమాపక సిబ్బంది చనిపోయారన్నారు. వారి సంస్మరణార్థం ప్రజలకు అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించడం కోసం ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది అగ్ని సురక్షిత భారతదేశం కోసం వారోత్సవాలు ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్లు పేర్కొన్నారు.

యర్రగొండపాలెం: అనుకోకుండా జరిగే అగ్ని ప్రమాదాలపై జాగ్రత్తగా ఉండాలని ఎంఈవో పి.ఆంజనేయులు అన్నారు. సోమవారం అగ్నిమాపక వారోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే అగ్ని మాపక కేంద్రానికి సమాచారం అందించాలన్నారు. విపత్తులు సంభవించే సమయంలో అగ్నిమాపక సిబ్బంది తమ ప్రాణాలు లెక్కచేయకుండా ప్రజలకు సేవలు అందించే వారిని తామందరం అభినందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో కరపత్రాలు ఆవిష్కరించారు.

సేవకుల యూనియన్ ఎన్నిక

కురిచేడు: మండల సేవకుల యూనియన్ నూతన అధ్యక్షుడిగా కంభంపాటి సామేలును సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక చర్చిలో మండల పాస్టర్లందరూ సమావేశమై నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పి. గురవయ్య, సెక్రటరీగా పి.స్టాలిన్, జాయింట్ సెక్రటరీగా వై.హోనోకు, ట్రెజరర్‌గా బి.త్రిపురయ్య, ఈసీ మెంబర్లుగా ఎం దేవసహాయం, పల్లె ప్రభాకర్, సలహాదారులుగా జె.రవి, జి.నిమ్మేష్, షేక్ ఖాశీం, కె.రాజశేఖర్‌లను సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


సేవకుల యూనియన్ అధ్యక్షుడు సామేలు

రెండు బైకుల ఢీ..ఇద్దరికి గాయాలు


వెంకట నరసయ్య..

కురిచేడు: ఎదురెదురుగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన నాగార్జున సాగర్ కాలువ వద్ద సోమవారం జరిగింది. గంగదొనకొండ గ్రామానికి చెందిన భూపతి వెంకట నర్సయ్య తన పనులు ముగించుకొని స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. ఆ సమయంలో పొట్లపాడు గ్రామానికి చెందిన చింతలచెరువు వెంకటేశ్ తన ద్విచక్ర వాహనంపై కురిచేడు వస్తున్నాడు. రెండు వాహనాలు కాలువ వద్ద ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. 108కి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది షేక్ మహబూబ్‌బాషా, కురంగి నరేష్‌లు క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేసి అనంతరం మెరుగైన చికిత్స కోసం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.


గాయపడిన వెంకటేశ్